క్లుప్తంగా

ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



చెన్నారావుపేట: గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లు లేని నిరుపేదలకు స్థలంతోపాటు ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు వెంటనే ఇవ్వాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య డిమాండ్ చేశారు. మండలంలోని లింగగిరి గ్రామంలో నిరుపేదలు గుడిసెలు వేసుకున్న ప్రాంతాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ తొమ్మిదేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇళ్లు ఇస్తామని చెబుతూ పేదలను మభ్యపెడుతున్నాయన్నారు. పేదల కోసం ఎర్రజెండా పార్టీ పోరాటాలు చేస్తోందని, ఇళ్ల స్థలాలు వచ్చేంత వరకు పోరాటాలు ఆపేది లేదన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకట్రాములు, సీపీఎం జిల్లా సభ్యులు నమిండ్ల స్వామి, మండల కార్యదర్శి శారద తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాతకు బోనాలు



సంగెం : మండలంలోని తీగరాజుపల్లి శివారు పుతాన్‌తండా, పోచమ్మ తండాలో దుర్గామాత బోనాలను ఘనంగా నిర్వహించారు. సోమవారం రాత్రి గిరిజన మహిళలు దుర్గామాతకు బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుగులోత్ రమాదేవి, తండా వాసులు పాల్గొన్నారు.

బోరుబావి ధ్వంసం



ఖానాపురం : మండలంలోని అశోక్ నగర్ గ్రామానికి చెందిన కుదురు పాక రాములుకు దుసముద్రం శివారులో బోరు బావి ఉంది. కాగా సోమవారం రాత్రి బోరుకు బిగించిన పైపులను నరికివేసి మోటార్‌ను అందులో పడేశారని రాములు తెలిపారు. బోరు బావిలో రాళ్లు సైతం వేసి పనికి రాకుండా చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కూడా ఇలాగే చేశారని, ట్రాక్టర్ ఇంజన్‌ను సైతం గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు వివరించారు. పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికి ఫలితం లేకుండా పోయిందని బాధితుడు వాపోయాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అనుమానం ఉన్న వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని బాధితుడు రాములు కోరాడు. కాగా బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

జాతర షురూ..



చెన్నారావుపేట : మండలంలోని పదహారు చింతల్‌తండా శివారులోని నక్కలగుట్ట, కోనాపురం గ్రామాలలోని గుట్టలపై వెలిసిన లక్ష్మీనర్సింహస్వామి జాతర హోలీ పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం ప్రారంభమయ్యాయి. నక్కలగుట్టలో బోడమాణిక్యం తండా సర్పంచ్ బోడ ఆనంద్ కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోనాపురంలో సర్పంచ్ వెల్దె సుజాత, ఉపసర్పంచ్ మండల నర్సింహరాములు, ఎంపీటీసీ గుండాల మహేందర్‌లతో పాటు పలువురు నాయకులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.


కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి

శాయంపేట : డాక్టర్ చెరుకు సుధాకర్‌గౌడ్‌ను చంపుతామని బెదిరిస్తున్న కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ఉద్యమ నాయకుడు దామెరకొండ కొమరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సుధాకర్ తండ్రి ఉషాగౌడ్ కమ్యూనిస్టు పార్టీ యోధుడని కొనియాడారు. ఆయన ఆశయాలను పునికిపుచ్చుకొని సుధాకర్‌గౌడ్ డాక్టర్‌గా సేవలందిస్తూ, పేద ప్రజల తరుపున పోరాటం చేస్తున్నాడని కొనియాడారు.

ఇక ‘ఆరోగ్య మహిళ’

- మహిళా దినోత్సవం సందర్భంగా నేడు ప్రారంభం
- జిల్లాలోని నాలుగు కేంద్రాల్లో సేవలు

గీసుకొండ: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ‘ఆరోగ్య మహిళ’ అనే కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా జిల్లాలో రెండు పీహెచ్‌సీలు, రెండు యూపీహెచ్‌సీల్లో సేవలను బుధవారం ప్రారంభిస్తున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. పర్వతగిరి, చెన్నారావుపేట పీహెచ్‌సీలు, రంగశాయిపేట, కీర్తినగర్ యూపీహెచ్‌సీల్లో మహిళా ఆరోగ్య సేవలు ప్రారంభిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతీ యువతికి వచ్చే ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పిస్తూ.. మహిళా వైద్యులు, సిబ్బందితో సేవలు అందిస్తామన్నారు. సాధారణంగా మహిళలకు గర్భాశయ కేన్సర్, రక్తహీనత, మూత్ర కోశ సంబంధిత వ్యాధులు, లైంగిక సంబంధమైన అంటు వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లు, అసహజమైన రుతుక్రమం, శారీరక బరువు తదితర ఆరోగ్య సమస్యలు ఉంటాయని పేర్కొన్నారు. ఎంపిక చేసిన నాలుగు కేంద్రాల్లో అవసరమైన వైద్యసదుపాయాలు అందించి.. మరింత అవసరం ఉంటే నర్సంపేట సీహెచ్‌సీ, వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి రెఫర్ చేస్తామన్నారు. ఆశ, ఆరోగ్య కార్యకర్తలు మహిళలకు అవగాహన కల్పించి.. వారికి ఆరోగ్య సమస్యలు ఉంటే ఎంపిక చేసిన నాలుగు కేంద్రాలకు రెఫర్ చేయాలన్నారు. అలాగే ప్రతీ మంగళవారం ఓపీ కూడా నిర్వహిస్తామన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని వైద్య పరీక్షలు, సేవలను పొందాలన్నారు.





8రకాల పరీక్షలు ఇవే..

- మధుమేహం, రక్త పోటు, రక్త హీనత, ఇతర సాధారణ పరీక్షలు.
- ఓరల్, సర్వైకల్, రొమ్ము కేన్సర్ల స్క్రీనింగ్ టెస్ట్.
- థైరాయిడ్ పరీక్ష, సూక్ష్మ పోషక లోపాల గుర్తింపు, అయోడిన్ సమస్య, ఫోలిక్ ఆసిడ్, ఐరన్ లోపం, విటమిన్ బీ–12, విటమిన్–బీ పరీక్షలు, చికిత్స, మందులు.
- మూత్రకోశ సంబంధిత ఇన్‌ఫెక్షన్లు, ఫెల్విక్ ఇన్‌ఫ్లమేటరీ వ్యాధుల పరీక్షలు.
- మెనోపాజ్ దశకు సంబంధించిన పరీక్షలు, అవసరమైన వారికి హార్మోన్ రిప్లేస్‌మెంట్ థెరపీ, కౌన్సెలింగ్.
- నెలసరి సమస్యలపై పరీక్షలు, సంతాన సమస్యలపై ప్రత్యేక పరీక్షలు, అవసరమైన వారికి అల్ట్రా సౌండ్ టెస్టులు.
- లైంగిక సంబంధిత అంటువ్యాధుల పరీక్షలు, అవగాహన కలిగించడం.
- బరువు నియంత్రణ, యోగా, వ్యాయామంపై అవగాహన.



‘ఆరోగ్య మహిళ’ను వినియోగించుకోవాలి

చెన్నారావుపేట : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నేటి నుంచి ప్రారంభించనున్న ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని మహిళలు వినియోగించుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు సరోజ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ లైంగికంగా వచ్చే అంటువ్యాధులు, మూత్రనాళాల్లో వచ్చే ఇన్‌ఫెక్షన్లు, గర్భకోశ, గర్భకోశ ముఖద్వారా ఇన్‌ఫెక్షన్లు, క్యాన్సర్, విటమిన్ లోపం, పోషకాహార లోపంతో పాటు పలు సమస్యల పరిష్కారానికి ప్రతీ మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. అవసరం ఉన్న మహిళలకు జిల్లా ఆస్పత్రికి రిఫెర్ చేస్తామన్నారు. అనంతరం ఉచితంగా మందులు అందిస్తామని ఆమె పేర్కొన్నారు.

సహకారం.. సమైక్యం

- పొదుపుతో అభివృద్ధికి బాటలు వేసుకున్న సభ్యులు
- బ్యాంకులతో పని లేకుండా ఎదిగిన ఝాన్సీ మహిళా సంఘం
- 30 ఏళ్ల ప్రస్థానం.. రూ.1.70కోట్ల నిల్వలు



30వ వార్షిక సభలో పాల్గొన్న సభ్యులు(ఫైల్)

దుగ్గొండి: వారంతా ఇంటికే పరిమితమయ్యారు. కుటుంబ పోషణలో పాలుపంచుకున్నారు. ఆర్థికంగా ఎదగాలనుకుని చేయి చేయి కలిపారు. పొదుపు మంత్రాన్ని పఠించారు. బ్యాంకులతో పని లేకుండా కోట్ల రూపాయల టర్నోవర్ చేస్తూ రూ.లక్షల్లో సభ్యులకు వడ్డీకి అప్పులిచ్చే స్థాయికి ఎదిగారు. తొగర్రాయి గ్రామంలో 1993లో 70 మంది మహిళలు ఝాన్సీ మహిళా పొదుపు పరస్పర సహకార సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. నెలనెలా రూ.20 చొప్పున పొదుపు చేస్తూ.. 642 మంది సభ్యులతో ఆర్థికంగా బలోపేతమయ్యారు. రూ.1.70కోట్ల నిలవ్వను సాధించి.. తమ అవసరాలకు బ్యాంకులతో పని లేకుండా కేవలం 0.75 పైసల వడ్డీకి గరిష్టంగా ఒక్కో సభ్యురాలికి రూ.1.40లక్షల చొప్పున అప్పు ఇస్తున్నారు. వ్యవసాయ పెట్టుబడి, కుటీర పరిశ్రమల నిర్వహణ, చిరు వ్యాపారాల కోసం వారి భర్తలు మహిళా సభ్యులపైనే ఆధారపడుతున్నారు. సంఘ సభ్యులు ఎవరైనా మరణిస్తే సామూహిక బీమా, అభయనిధి సొమ్ము నుంచి రూ.45వేలు మృతురాలి నామినీకి అందిస్తూ ఆ కుటుంబానికి అండగా నిలుస్తున్నారు.

బాధ్యతలు భుజానికెత్తుకుని..

నర్సంపేట: భర్త చనిపోయాడనే బాధ ఉన్నా.. కుమిలిపోలేదు. కుటుంబ బాధ్యతను తనపై వేసుకుని ముగ్గురు కూతుళ్లను చదివిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది కండక్టర్ పద్మ. కండక్టర్ జాటోతు పద్మ భర్త యాకునాయక్ 2008లో నర్సంపేట డిపోలో మెకానిక్‌గా పనిచేస్తూ మృతిచెందాడు. కారుణ్య నియామకం కింద అతడి భార్య పద్మకు ఆర్టీసీ సంస్థ కండక్టర్‌గా నర్సంపేట డిపోలో ఉద్యోగం ఇచ్చింది. దీంతో చిరుద్యోగం చేస్తూనే పద్మ ముగ్గురు కూతుళ్లను ఉన్నత చదువులు చదివిస్తోంది. పెద్ద కుమార్తె స్రవంతి బీటెక్ పూర్తి చేసింది. రెండో కూతురు వాసంతి వెటర్నరీ పీజీ చేస్తోంది. మూడో కుమార్తె సాయి ప్రియ పీజీ మొదటి సంవత్సరం చదువుతోంది.



జాటోత్ పద్మ



పద్మ కూతుర్లు

నేడు ఏనుగల్‌కు మంత్రి కేటీఆర్ రాక



పర్వతగిరి: ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అరూరి రమేష్, నాయకులు

వరంగల్ (పర్వతగిరి) : మండలంలోని ఏనుగల్ గ్రామానికి నేడు(బుధవారం) మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ రానున్నారు. ఈ మేరకు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ మంగళవారం హెలిప్యాడ్, సభా స్థలం, పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిమ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంత్రి కేటీఆర్ ప్రారంభించనున్నారని తెలిపారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



రాయపర్తి : మాట్లాడుతున్న నాయకులు

కేటీఆర్ సభను విజయవంతం చేయాలి

రాయపర్తి : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నేడు తొర్రూరులో తలపెట్టిన కేటీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎంపీపీ అనిమిరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణ పునర్నిర్మాణ దశలో కేసీఆర్ దశలవారీగా అన్ని రంగాల అభివృద్ధికి పాటుపడుతున్నారని, ఈ క్రమంలోనే మహిళ సాధికారత కోసం విరివిగా వడ్డీలేని రుణాలు ఇస్తున్న ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, రైతుబంధు మండల అధ్యక్షుడు ఆకుల సురేందర్ రావు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, పార్టీ నాయకులు ఎలమంచ శ్రీనివాస్ రెడ్డి, మార్గం సారంగం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రారంభమైన కొమ్మాల జాతర

గీసుకొండ : మండలంలోని ప్రసిద్ధ కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి జాతర హోలీ పండుగ సందర్భంగా మంగళవారం నుంచి ప్రారంభమైంది. ఈసారి రాజకీయ ప్రభలను జాతరకు అనుమతించడంతో కొమ్మాల, గిర్నిబావి సెంటర్లలో సందడి నెలకొంది. బీఆర్‌ఎస్ ప్రభ బండిని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కొమ్మాల స్టేజీ వద్ద ప్రారంభించగా, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కాంగ్రెస్, బీజేపీ, వామపక్ష పార్టీల ప్రభలు జాతరకు తరలిరావడంతో వరంగల్–నర్సంపేట రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు డీజేలు, రాజకీయ జెండాలు వద్దని ఆంక్షలు విధించగా ఆయా పార్టీల వారు వాటిని పట్టించుకోకుండా జెండాలు, డీజేలతో తరలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ భక్తులు, ప్రజల కోరిక మేరకే ప్రభలు జాతరలో ప్రారంభమైనట్లు తెలిపారు.

శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణం

రాయపర్తి : హోలీ పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించే లక్ష్మీనర్సింహస్వామి కల్యాణ వేడుకలను మండలంలోని బందనపల్లిలో మంగళవారం వైభవంగా నిర్వహించారు. స్వయంభూ వెలసిన దివ్యక్షేత్రం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దీప్లా నాయక్, కమిటీ సభ్యులు,స్థానికులు పాల్గొన్నారు.

కొండాపురంలో చెన్నకేశవస్వామి కల్యాణం..

మండలంలోని కొండాపురంలో చెన్నకేశవస్వామి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కోదాటి దయాకర్‌రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.



విద్యుత్ దీపాల అలంకరణలో ఆలయం..



గీసుకొండ: కొమ్మాల జాతరలో భక్తుల సందడి



బీఆర్‌ఎస్ ప్రభబండి



కాంగ్రెస్ పార్టీ ప్రభబండి



రాయపర్తి: కొండాపురంలో..



రాయపర్తి: బందనపల్లి గ్రామంలో..

సంగెం: హోలీ వేడుకల్లో ఎంపీపీ కళావతి, మహిళలు



హోలీ వేడుకల్లో పాల్గొన్న యువకులు



నల్లబెల్లి: వేడుకలో రంగులు చల్లుకుంటున్న స్థానికులు



చెన్నారావుపేట: రంగులు చల్లుతున్న యువకులు



హోలీ.. రంగుల కేళీ

జిల్లా వ్యాప్తంగా హోలీ పండుగ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా రంగులు చల్లుకుంటూ కేరింతలు కొట్టారు. యువకులు, మహిళలు పెద్ద ఎత్తున రంగులు చల్లుకున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి ఆడిపాడారు. యువత రంగుల్లో మునిగి తేలారు.

– సాక్షి నెట్‌వర్క్



నర్సంపేట: ఏసీపీ సంపత్‌రావుపై రంగు చల్లుతున్న బీఆర్‌ఎస్ నాయకులు



హోలీ ఆడుతున్న యువకులు



నర్సంపేట: వేడుకల్లో కార్మిక సంఘం నాయకులు



సంగెం పోలీస్‌స్టేషన్‌లో..



ఖానాపురం: వేడుకల్లో బీఆర్‌ఎస్ నాయకులు



దుగ్గొండి: పొనకల్‌లో హోలీ ఆడుతున్న ఉపాధి హామీ కూలీలు



పర్వతగిరి: హోలీ వేడుకల్లో సర్పంచ్, మహిళలు



ఖానాపురం: పోలీస్‌స్టేషన్‌లో..



ఖానాపురం: హోలీ వేడుకల్లో చిన్నారులు



సంగెంలో..



వర్ధన్నపేట: అంబేడ్కర్ సెంటర్ వద్ద..



రాయపర్తిలో హోలీ ఆడుతున్న యువకులు

ప్రభ బండ్లు సిద్ధం

దుగ్గొండి : ప్రసిద్ధ కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి జాతరలో బండ్లు తిరుగుట కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాల్లో రకరకాల బండ్లు సిద్ధం చేశారు. పూర్వం నుంచి కొమ్మాల జాతరకు బండ్లు తరలించేది దుగ్గొండి మండల పరిధిలోని గ్రామాల నుంచే. ఇదే ఆనవాయితీ ప్రకారం కొమ్మాల పరిసర గ్రామాలైన నాచినపల్లి, పొనకల్, బిక్కాజిపల్లి, తొగర్రాయి, గిర్నిబావి, రేకంపల్లి, రేబల్లె, మందపల్లి, రాజ్యతండా, మదిర, చాపలబండ, అడవిరంగాపురం గ్రామాల నుంచి చక్రపు బండ్లు, ఏనుగ బాణాలు, గుర్రపు బాణాలు, పాలారపు బండ్లు, విష్ణు చక్రం బండ్లు ఇలా వందల సంఖ్యలో తరలిస్తున్నారు. దీంతో పాటు రాజకీయ జాతరగా పేరున్న కొమ్మాల జాతరలో ఈసారి వివిధ రాజకీయ పార్టీల నాయకులు ప్రభలను తరలించడానికి సిద్ధం చేసుకున్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, వామపక్ష పార్టీల కార్యకర్తలు మంగళవారం ఉదయం నుంచే బండ్లు తయారు చేసే పనిలో నిమగ్నమయ్యారు. బుధవారం తెల్లవారుజామున బండ్లను కొమ్మాలకు తరలించనున్నారు. రాజకీయ ప్రభల నిషేధం దశాబ్ద కాలంగా కొనసాగడం.. ఈసారి షరతులతో కూడిన అనుమతి లభించడంతో మరోసారి రాజకీయ జాతరగా మారనుంది. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు బల ప్రదర్శనకు జాతర వేదిక కానుందని పలువురు చర్చించుకుంటున్నారు.





చిన్నారిపై వృద్ధుడి అత్యాచారయత్నం

నల్లబెల్లి : చిన్నారి బాలిక(8)పై వృద్ధుడు అత్యాచార యత్నం చేసిన సంఘటన మండలంలోని ఓ గ్రామంలో సోమవారం జరిగింది. బాధిత కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఓ గ్రామానికి చెందిన 8ఏళ్ల చిన్నారిపై ఆమె ఇంటి సమీపంలో నివసిస్తున్న గూడ రాజయ్య (రాజిరెడ్డి) పలుమార్లు అత్యాచారాయత్నానికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం చిన్నారి కిరాణం షాపునకు వెళ్లి బిస్కెట్లు కొనుగోలు చేసి ఇంటికి వస్తోంది. గమనించిన వృద్ధుడు ఆమెను ఇంట్లోకి పిలిచి నిర్బంధించి వివస్త్రను చేసి ముఖానికి పౌడర్ వేశాడు. అనంతరం బాలికపై వృద్ధుడు బలవంతంగా అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. కాగా, భయభ్రాంతులకు గురైన చిన్నారి జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియచేయగా.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోక్సో కేసు నమోదు చేసి బాలికను వైద్య పరీక్షల నిమిత్తం వరంగల్‌లోని సీకేఎం ఆస్పత్రికి తరలించారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సురేష్ నాయక్ తెలిపారు.